ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

శుక్రవారం 3 జనవరి 2025



8

తెనాలి : సాలీడు ఏర్పరచుకున్న గూడుపై పడిన మంచుతో మెరిసిపోతున్న చిత్రం

ముత్యమల్లే మెరిసిపోయే మంచు తీగ

❖ కొత్త సంవత్సరంలో మంచు అందాలు ❖ పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి ❖ ముత్యాలను తలపించేలా మంచు సోయగాలు



అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ముమ్మరంగా సాగుతున్న చెట్లు తొలగించే పనులు

కొత్త ఏడాది.. రాజధాని రైతుల్లో కొంగొత్త ఆశలు నింపుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఈ ఏడాది మలి అర్ధభాగంలో సంతోషం కళ్ల చూసిన రాజధాని రైతులకు రాబోయే ఏడాది మరింత సంతోషాన్ని నింపుతుందని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఎంతో సంతోషంగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నారు. ఐదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నియంతృత్వం కింద నలిగిపోయిన రాజధాని రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఊపిరి తీసుకున్నారు. అధికారంలోకి వచ్చీ రాక ముందే కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతికి భరోసా కల్పించడం, నిర్మాణ పనుల్లో కదలిక తీసుకురావడంతో రైతుల ఆశలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



- కొత్త ఏడాది అమరావతిలో కొత్త వెలుగులు!
- కూటమి సర్కారు రావడంతో పూర్వ వైభవం
- అభివృద్ధి పనులతో దూసుకుపోతున్న నవనగరం
- ఆశావహంగా సాగిన ఈ ఏడాది మలి అర్ధభాగం
- కొత్త ఏడాది కొత్త భవనాలతో నగరం శోభాయమానం
- ఐదేళ్ల బాధలు.. కౌలు కష్టాలు తీరడంతో రైతుల్లో ఆనందం

కలల రాజధానిపై.. కొత్త ఆశలు



జీఏడీ టవర్స్ నిర్మించాల్సిన ప్రాంతంలో భారీ మోటార్లతో నిర్విరామంగా సాగుతున్న నీటిని తొలగించే పనులు





గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ, కల్పించిన భరోసా కారణంగా రాజధానిలోని 28వేల మంది రైతులు భూ సమీకరణలో 34వేల ఎకరాల భూములు ఇచ్చారు. అప్పటి కూటమి ప్రభుత్వం రూ. 10వేల కోట్లతో రాజధానిలో శాశ్వత పరిపాలనా కార్యాలయాల నిర్మాణ పనులను చేపట్టింది. నాలుగేళ్లపాటు జోరుగా పనులు సాగడంతో నవ్యాంధ్ర రాజధాని కళకళలాడింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను చిదిమేసింది. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చి, పనులన్నింటినీ అర్థాంతరంగా ఆపేసింది.

రాజధాని రైతులపై, ప్రత్యేకించి మహిళలపై అనేక దాష్టీకాలకు పాల్పడింది. భూములిచ్చిన రైతులను వేధించడమే లక్ష్యంగా రైతుల కౌళ్లు నిలిపివేసింది. వాళ్లకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను ఆపేసింది. జోన్-5 పేరుతో రాజధానిలో చిచ్చు రాజేశారు. రైతుల భూములను వారికి ఇవ్వకపోగా వాటిని వేరెవరికో పందేరం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై లాఠీలతో విరుచుకుపడింది. మహిళల పొత్తికడుపులపై పోలీసుల బూటు కాళ్లు విరుచుకుపడ్డాయి. ముళ్ల కంచెల్లో వేసి రైతులు, మహిళలను ఈడ్చుకుంటూ పోయి అరెస్టులు చేశారు. వేలాది మంది రైతులపై వందలాది కేసులు బనాయించి వేధించారు. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు పెట్టి వారిని కౌలుకు అనర్హులుగా చేశారు. దళితులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే గడిచిన ఐదేళ్లలో రాజధానిలో రైతులు, మహిళలపై జరిగిన దాష్టీకాలకు అంతే లేకుండాపోతుంది. అంతటి దాష్టీకాలను సైతం రైతులు, మహిళలు సహనంతో, శాంతియుత పోరాటాలతో ఎదుర్కొని నిలిచారు. రాజధానిని నిలబెట్టుకున్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ అమరావతిని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నారు.

● కూటమి రాకతో మారిన తలరాత

కూటమి ప్రభుత్వం రావడంతో రాజధాని తలరాత ఒక్కసారిగా మారిపోయింది. ఐదేళ్ల పాటు రైతులు, మహిళలకు కష్టాలు తొలగిపోయాయి. రాజధానికి భరోసా లభించడంతో వారి ఆశలు తిరిగి ఊపిరి పోసుకున్నాయి. రైతుల ఆశలను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను గుర్తించిన కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రాజధాని పనులు ప్రారంభించింది. ఐదేళ్ల పాలనలో అడవిలా మారిన అమరావతిని అద్దంలా మార్చే పనికి శ్రీకారం చుట్టింది. రూ. 36.5 కోట్ల రూపాయలతో జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహించి కంపచెట్లను తొలగించింది. జూన్ 12న కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించి రాజధాని పట్ల తనకున్న చిత్త శుద్ధిని ప్రకటించింది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు రాజధాని గ్రామాల్లో పర్యటించి రైతులకు విశ్వాసం కల్పించారు. ఆగిపోయిన భవనాల నిర్మాణ పనులపై అధికారులను కదిలించారు. దీంతో రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

● ఎల్ఈడీ కాంతులతో నవనగరం..

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రాజధాని రహదారులకు మోక్షం కలిగింది. అప్పటివరకూ కంప చెట్లతో నిండిపోయిన రోడ్లను అధికారులు వినియోగంలోకి తెచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్డుపై ఎల్ఈడీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి

(మిగతా 8వ పేజీలో)

కొందరికే.. కందిపప్పు

◆ అరకొరగా సరఫరా ◆ రాగి.. గోధుమ పిండి పంపిణీ నిలిపివేత ◆ జొన్నలూ లేవాయే





జొన్నలు

రేషన్ కార్డు దారులకు వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాయితీ కందిపప్పు సరఫరాను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. అయితే.. కందిపప్పు పంపిణీ రెండు నెలలకే పరిమితమైంది. ఈ నెల అరకొరగా కందిపప్పు సరఫరా చేశారు. కొందరు లబ్ధిదారులకే కందిపప్పు పంపిణీ పరిమితమైంది. జొన్నలు.. రాగి.. గోధుమ పిండి సరఫరా నిలిపివేశారు. పెద్ద పండుగ సంక్రాంతికి సరుకులు కోత విధించడంపై కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ సరుకుల కుదింపుతో పేదలు ఇక్కట్లు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంది పప్పు కిలో రూ. 175 నుంచి రూ. 180 వరకు ధర పలుకుతున్నది. ప్రభుత్వం తెల్లకార్డు దారులకు ప్రతి నెల కందిపప్పు పంపిణీ చేయడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలు కందిపప్పు ఇతర సరుకులను పంపిణీ చేసింది. ఈ నెలలో సరుకుల పంపిణీలో కోత విధించింది. ప్రైవేట్ మార్కెట్‌లో ధర పెరగడంతో ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేసే కందిపప్పు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కార్డు దారులకు బియ్యం.. పంచదార పంపిణీతో సరిపెడుతున్నారు. కందిపప్పు అడిగితే పంపిణీ దారులు స్టాక్‌లేదంటున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు అరకొరగానే ఈ నెలలో కందిపప్పు సరఫరా అయింది. మూడు జిల్లాలకు గోధుమ పిండి సరఫరా నిలిచిపోయింది. జొన్నలు ఒక్క పల్నాడు జిల్లాకే అది కూడా 7.17 శాతం కార్డు దారులకే సరఫరా చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాలకు జొన్నలు సరఫరా నిలిపివేశారు. రాగి పిండి కూడా పల్నాడు జిల్లాకు 0.19 శాతం పంపిణీ చేయగా బాపట్ల, గుంటూరు జిల్లాలకు పూర్తిగా నిలిపివేశారు.

◆ పల్నాడు జిల్లాలో 6,45,126 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కొక్క కార్డు దారునికి ఒక కిలో కందిపప్పు ప్యాకెట్ అందజేయాలి. ఈ నెలలో 27.26 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 1,94,409 ప్యాకెట్లకు డీలర్ల నుంచి ఇండెంట్ వచ్చింది. 1,75,892 ప్యాకెట్ల కందిపప్పును మాత్రమే డీలర్లకు సరఫరా చేశారు.

◆ బాపట్ల జిల్లాలో 4,86,151 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 53.33 శాతం కార్డుదారులకు మాత్రమే కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్ల నుంచి 2,69,762 ప్యాకెట్‌ల కందిపప్పు కోసం ఇండెంట్ వచ్చింది. దీనిలో 2,56,276 ప్యాకెట్‌ల కందిపప్పు కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు అందజేశారు.

◆ గుంటూరు జిల్లాలో 5,99,558 తెల్ల కార్డులు ఉన్నాయి. ఈ నెలలో 62.72 శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేస్తున్నారు. డీలర్లు 3,93,627 కిందిపప్పు ప్యాకెట్‌ల కోసం ఇండెంట్ వచ్చింది. దీనిలో 3,76,046 కార్డుదారులకు పంపిణీ చేసేందుకు డీలర్లకు కందిపప్పు అందజేశారు.

◆ కందిపప్పు పంపిణీ కొందరికే పరిమితం కావడంతో పాటు రాగి గోధుమ పిండి.. జొన్నలు సరఫరా నిలిపివేయడంతో కార్డు దారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ. 67కే ఇస్తున్నది. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ. 100 నుంచి రూ. 110 వరకు అధికంగా ఉండటంతో కార్డుదారులు రాయితీ కందిపప్పు పంపిణీ చేయాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కందిపప్పుతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేదలపై మోయలేని ఆర్థిక భారం పడుతుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ

● గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల వసూలు
● రాష్ట్రంలోనే గుంటూరుకు మూడో స్థానం

6

మిర్చియార్డులో కమీషన్ ఏజంట్ల లైసెన్సుల పునః పరిశీలన

● నాలుగు బృందాలను నియమించిన మార్కెటింగ్ డైరెక్టర్

యార్డు ప్రక్షాళనకు శ్రీకారం

● పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు
● ఇతర యార్డుల అధికారులకు స్థానం
● రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత

8

అద్భుతంగా అభివృద్ధి ప్రణాళిక

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



బాపట్ల, జనవరి 02 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అద్భుతమైన ప్రణాళిక రూపొందించినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. నూతన సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాల గురించి ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వివరించారు. విజయవాడ-గూడూరుకు రెండు రైల్వేలైన్‌లు ఉన్నాయని మూడో లైన్ నిర్మాణంలో ఉందన్నారు. నాల్గో లైన్ కూడా ఏర్పాటు చేయాలని తాను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనివల్ల బాపట్ల, చీరాల, ఒంగోలు, విజయవాడల మధ్య ప్యాసింజర్ రైళ్ళు, ఇంటర్‌సిటీలు క్రాసింగ్ పెట్టకుండా నడిపే అవకాశం ఉంటుందన్నారు. రేపల్లె-తెనాలి రైల్వేలైన్ ఒకటి ఉండగా మరొకటి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా మంజూరు చేశారన్నారు. రేపల్లె-బాపట్ల కొత్త రైల్వేలైన్ ప్రతిపాదించగా శాంక్షన్ చేసి సర్వే ప్రారంభించారన్నారు. బాపట్ల, చీరాల రైల్వే స్టేషన్‌లు అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారన్నారు. వేమూరు దగ్గర డెల్టా ప్యాసింజర్ ఆగేవిధంగా, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ చీరాల, బాపట్లలో ఏదో ఒక ప్రాంతంలో ఆపాలని ప్రతిపాదించగా పరిశీలనలో ఉందన్నారు.

అమరావతి నుండి నిజాంపట్నంకు నాలుగు వరుసల రోడ్డు మంజూరయిందని వివరించారు. జాతీయ రహదారి 216కు ఎన్‌హెచ్16ను కనెక్టివ్ చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల మచిలీపట్నం, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌ల నుండి చెన్నై వెళ్ళటానికి సులభతరంగా ఉంటుందన్నారు. 216 జాతీయ రహదారి రెండు వరుసల రోడ్డుగా మాత్రమే ఉందని దీనిని నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. దీనికి సంబంధించిన సర్వే ప్రారంభమౌతుందన్నారు. బాపట్ల-గుంటూరు రోడ్డు 8 మీటర్ల వెడల్పు ఉండగా దీనిని 10 మీటర్లకు పెంచేవిధంగా ప్రతిపాదించగా 63 కిలోమీటర్ల పొడువునా ఎస్‌హెచ్‌సీ 40 రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

● బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాలుగు పురపాలక సంఘాలలో నాలుగు కేంద్రియ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు.

● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల పర్యటనకు వచ్చినప్పుడు తాను చెప్పిన ప్రకారం మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశానన్నారు.

● గత పాలకులు జలజీవన్‌మిషన్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళలేకపోయారన్నారు. 582 కోట్ల రూపాయలు మంజూరైతే 523 కోట్లు వినియోగించకుండా వదిలేశారన్నారు. దీనిని ఉపయోగించి ప్రతి ఇంటికి, ప్రతి పాఠశాలకు తాగునీటిని సరఫరా చేసేవిధంగా కృషి చేస్తామని ఎంపీ తెలిపారు. అదేవిధంగా పరిశ్రమల ఏర్పాటు విషయమై ప్రతి మండలంలో టీమ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం.. మెనూలో మార్పులు

● పరిగణలోకి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల సూచనలు
● ఏజన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

గుంటూరు(విద్య),జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం మెనూలో మార్పులు సంక్రాంతి తరువాతే అమల్లోకి రానున్నాయి. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులు చేయబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన మధ్యాహ్న భోజన పథకాన్ని గాడిలో పెట్టేలా ఎన్డీఏ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా తొలుత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల్ని పునరుద్ధరించారు. వారి సూచనలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని మెనూలో మార్పులకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్,ఎయిడెడ్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలు 4300పైగా ఉండగా, ఉన్నత పాఠశాలలు 345పైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 6.45 లక్షల మంది ఉన్నారు. అయితే ఇందులో దాదాపు 20 నుంచి 35శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడం లేదు. దీనికి ప్రధాన కారణాలు అనేక ఉన్నాయి. ఆయా విషయాలు అనేకసార్లు గత ప్రభుత్వం దృష్టికి విద్యాశాఖ నివేదిక రూపంలో అందించినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో కలెక్టర్లు సంబంధిత విభాగాలతో, సమీక్ష నిర్వహించారు. పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు భోజనం తీసుకునే విద్యార్థుల సంఖ్యకు మధ్య ఉన్న వ్యత్యాసాలు తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

మెనూలో మార్పులు ఇలా.....

- ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ తొలుత పెంచాలి. భోజనం కోసం సరఫరా చేసే బియ్యం పోర్టిఫైడ్ అంటూ లావుగా ఉన్న బియ్యం సరఫరా చేస్తు న్నారు. వాటి స్థానం లో సన్న బియ్యం ఇవ్వాలని యాజమాన్యల విజ్ఞప్తులు పరిశీలిస్తున్నారు.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారు. ఉదయం ఇచ్చే రాగిజావలో నాణ్యత ఉండటం లేదు. దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు ఇవ్వాలని లేదా పాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది.
- విద్యార్థుల రోజూవారీ మెనూలో ఒకరోజు ఇచ్చే పొంగలి కూడా తినటం లేదు దీనిలో కూడా మార్పులు చేయాలి.
- మంగళగిరి, తెనాలి, తాడికొండ తదితర నియోజక వర్గాల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించే మధ్యాహ్న భోజనం సాంబారుతో కలిపి ఇస్తున్నారు. ఇలా కాకుండా వైట్‌రైస్ సాంబారు విడివిడిగా ఇవ్వాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.
- అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపణీచేసే మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లు ఇవ్వడం లేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు కూడా సరఫరా చేయాలని యోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలు గుడ్డు ఉడకపెట్టి పెంకు తీసి ఇస్తున్నారని, దాన్ని పిల్లలు ఇష్టపడటం లేదు. ఉడికించిన గుడ్లు విద్యార్థులకే ఇస్తే వాళ్ళే పెంకు తీసుకొని వారే తినేలా ఏర్పాట్లు చేయాలి.
- ప్రతి శనివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో స్వీట్ ను ప్రసాదంగా భావించి పిల్లలు తినటం లేదని దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలకు బకాయిలు సకాలంలో చెల్లించడం లేదు. అప్పులు చేయాల్సి వస్తుందని, ఏ నెలకు, ఆనెల సకాలంలో బిల్లులు ఇస్తే అప్పులు బాధ తప్పుతుందని విజ్ఞప్తులు ఉన్నాయి. వంట చేసే ఏజన్సీలకు చెల్లించే ఛార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని యాజమాన్యాలు చేసిన విజ్ఞప్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా మార్పులతో సంక్రాంతి తరువాత నూతన మెనూ అమలు చేస్తారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)



● అద్దంకి మార్కెట్ యార్డులో పూర్తయిన ఏర్పాట్లు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో, అద్దంకిలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకిలోని మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. రెండు గంటల సమయంలో ముగ్గు వేయాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4వేలు అందజేయనున్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే ప్రతి మహిళకు ఆకర్షణీయమైన బహుమతి ఇవ్వనున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఫోన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోని మహిళలు కూడా నేరుగా పోటీల్లో పాల్గొన వచ్చని తెలిపారు.

10 నుంచి నారెడ్కో కాపిటల్ జోన్ మెగా ప్రాపర్టీషో


ప్రాపర్టీ షో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నారెడ్కో కాపిటల్ జోన్ 12వ మెగా ప్రాపర్టీషో - 2025 ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరుగనున్నదని ప్రాపర్టీషో కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు తెలిపారు. ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు గురువారం గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాపర్టీషోకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు మంత్రి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అతిథులుగా పాల్గొననున్నారని చెప్పారు. జనవరి 12న జరిగే షో ముగింపు కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితర ముఖ్య వ్యక్తులు పాల్గొంటారని చెప్పారు. షోలో మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు కానున్నాయని, బిల్డర్లు, రియల్ ఎస్టేట్, వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ సహా అనేక వర్గాల వారు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్, స్టేట్ జనరల్ సెక్రటరీ మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ సెక్రటరీ శ్రీనాథ్, మధుసూదన రెడ్డి, మల్లికార్జునరావు, శ్రీనివాస్ కుమార్ బాబు, దుర్గాప్రసాద్, మాదాల శ్రీనివాస్ బాబు హరిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అవయవ దాతల సంఘం ఐదో మహాసభ

● హాజరుకానున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఐదో మహాసభ శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింకాన ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మరణించినా అవయవదానంతో జీవించండి అనే నినాదంతో అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్యత పురస్కారాన్ని ప్రముఖ గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు అందజేయనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అవయవదానంపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు సావిత్రిబాయి పూలే సేవా పురస్కారాలను ప్రదానం చేస్తామని అన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ అవయవదాతలకు ఐడీ కార్డులను పంపిణీ చేస్తారని, ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ మహాసభకు దక్షిణ భారత దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

రోడ్డు పాడైపోతుందని ప్రశ్నించినందుకు దాడి

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చినకోండ్రుపాడు వద్ద కొంతకాలంగా జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలతో రోడ్డు పాడైపోతుందంటూ ప్రశ్నించిన గ్రామస్థునిపై మట్టి అక్రమం తవ్వకందారులు దాడి చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న కాలనీకి సమీపంలో కొంత కాలంగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. విపరీతంగా లారీలు తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడై పోయింది. ఈ క్రమంలో బుధవారం ఇదే విషయాన్ని స్థానికంగా ఉండే ఓ వ్యక్తి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటలు పెరగటంతో గ్రామస్థునిపై మట్టి అక్రమ తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి చేయి చేసుకున్నాడు. దీంతో కొద్దిపాటి ఘర్షణ జరగటంతో పోలీసులు వచ్చి వారిని పంపించి వేశారు. తిరిగి గురువారం ఉదయం చినకోండ్రుపాడు గ్రామస్థులు మట్టి తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. లారీలు తిరుగుతుండటం వలన రోడ్డు పాడై పోయిందంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో మట్టి అక్రమ తవ్వకందారులు, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎస్‌ఐ నాగేంద్ర అందరినీ అక్కడి నుంచిపంపించి వేశారు. మట్టి తవ్వకందారుల చేతిలో దెబ్బలు తిన్న గ్రామస్థుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు తవ్వకాలను పరిశీలించారు. అక్రమ తవ్వకాలు అయితే వారిపై చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ తెలిపారు.

ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణ

● గత ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల వసూలు
● రాష్ట్రంలోనే గుంటూరుకు మూడో స్థానం



గుంటూరు కార్గో పార్శిల్ కార్యాలయం

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించిన ఆర్టీసీ కార్గో రూ.12 కోట్ల వసూళ్లతో రాష్ట్రంలోనే మూడో స్థానానికి చేరుకుంది. వస్తు రవాణాకు గ్యారంటీ, నమ్మకం ఉండటంతో ఆర్టీసీ కార్గోకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆర్టీసీకి అనుబంధంగా ప్రైవేటు సంస్థ ఏఎన్ఎల్ పార్శిల్ రవాణా వ్యాపారం నిర్వహించారు. రాష్ట్ర విభజన అనంతరం ఆర్టీసీ సొంతంగా 2016 నుంచి ఆర్టీసీ కార్గో పార్శిల్ సంస్థకు శ్రీకారం చుట్టింది. వస్తువులు ఎక్కడి నుంచి ఎక్కడికైనా 24 గంటల్లో చేరేలా ప్రణాళికలు రూపొందించింది. సరుకు రవాణాపై కిలో మీటర్ల దూరం, వస్తువు బరువును బట్టి చార్జీ నిర్ణయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో కార్గో పార్శిల్ రవాణా సంస్థకు నిత్యం ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఇక్కడ నుంచి నిత్యం జిల్లాలోని పట్టణ ప్రాంతాలతో పాటు ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, అనంతపూర్ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకు రవాణా జరుగుతుందని అధికారులు తెలిపారు. ఆర్టీసీ డిపోలతో పాటు జిల్లా వ్యాప్తంగా 20 మందికి పైగా ఆథరైజ్డ్ డీలర్లతో కమీషన్ ప్రాతిపదికన కార్గో పార్శిల్ ఏజెంట్ల ద్వారా సరుకు రవాణా చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12.21 కోట్లతో రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉమ్మడి జిల్లా ఉండగా ప్రస్తుతం గత డిసెంబరు నాటికి దాదాపు రూ.9 కోట్ల ఆదాయంతో వ్యాపార లావాదేవీలు జరిపినట్లు తెలిపారు.

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

కార్గో పార్శిల్ సేవలకు సంబంధించి ప్రత్యేకంగా అధికారులను నియమించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణకు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎమ్), డిపోల వారీగా (డీఎమ్‌ఈ) డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు పర్యవేక్షిస్తున్నారు. వారిపై రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు వ్యవహరిస్తున్నారు.

డోర్ డెలివరీ సేవలకు మరింత ప్రాధాన్యం



వస్తు రవాణాపై ఆర్టీసీ కార్గో పట్ల ప్రజలకు ఉన్న నమ్మకమే ఆదరణను పెంచుతుంది. వస్తువులకు గ్యారంటీతో పాటు 24 గంటల్లో గమ్యస్థానాలకు పంపుతున్నాం. కార్గోలో డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం జిల్లా ప్రజా రవాణాధికారి ఎమ్.రవికాంత్ నేతృత్వంలో ఇప్పటికే గత నెల 19 నుంచి ఈ నెల 19 వరకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. కార్గో సేవలు మరింత విస్తృతం చేసి రాష్ట్రంలోనే గుంటూరు కార్గోను మొదటి స్థానంలో నిలపటమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- డి.ఆదినారాయణ. గుంటూరు కార్గో ఏటీఎం

పత్తిని కొని.. అమ్మాలి

● జిన్నింగ్ ప్రక్రియ సీసీఐ లక్ష్యానికి వ్యతిరేకం
● హైకోర్టులో సీసీఐ మాజీ జనరల్ మేనేజర్ పిటీషన్
● సంస్థ చర్యలు వల్ల ప్రభుత్వానికి రూ.17,500 కోట్లు నష్టం
● కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను (సీసీఐ) భారీ వివాదం చుట్టుముట్టింది. పత్తి కొనుగోలు చేసి పత్తిని మాత్రమే అమ్మాలన్న నిబంధనను అతిక్రమించడం ద్వారా సీసీఐ పరిధి దాటిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలైంది. గుంటూరుకు చెందిన సీసీఐ మాజీ జనరల్ మేనేజర్ ఈ పిటీషన్ దాఖలు చేశారు. ప్రతి సీజన్‌లో దేశవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తిని సేకరిస్తున్న సీసీఐ జిన్నింగ్ ప్రక్రియను చేపడుతోంది. మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ ది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్దేశించుకున్న లక్ష్యాలకు పత్తి జిన్నింగ్ ప్రక్రియ వ్యతిరేకం అని మాజీ జనరల్ మేనేజర్ ఆ పిటీషన్‌లో పేర్కొన్నారు. మెమోరాండం ఆఫ్ అసోసియేషన్‌లో కేవలం పత్తిని సేకరించి ముడి పత్తినే అమ్మాలన్న నిబంధన ఉందని ప్రస్తావించారు. ఒకవేళ అంతకు మించి ఏమైనా చేయాలంటే దానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి, అందుకు సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులు ఉండాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా సీసీఐ చేస్తున్న జిన్నింగ్ ప్రక్రియకు ప్రభుత్వం అనుమతి లేదన్న విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి డిసెంబరు 17వ తేదీన పార్లమెంట్‌లో వెల్లడించారని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ సీసీఐ రైతుల వద్ద మద్దతు ధరకు కేవలం పత్తిని కొనుగోలు మాత్రమే చేస్తుందన్న విషయాన్ని వెల్లడించారని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్‌ను పిటీషన్‌లో పొందుపరిచారు. సీసీఐ దేశవ్యాప్తంగా జిన్నింగ్ ప్రక్రియ చేపట్టడం వల్ల 2014-2021 వరకు రూ. 17,500 దాకా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. 2023-2024 సంవత్సరానికి మరో రూ. రెండు వేల కోట్ల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని కేంద్రం భర్తీ చేసిందని వెల్లడించారు. సీసీఐ కేవలం పత్తిని కొనుగోలు చేసి పత్తిని విక్రయిస్తే ఇంత నష్టం జరగదనేది మాజీ మేనేజర్ వాదన. సీసీఐ పోకడలు వల్ల జిన్నింగ్, స్పిన్నింగ్ పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సీసీఐ జిన్నింగ్ ప్రారంభించడం వలన వందల కొద్దీ జిన్నింగ్ మిల్లులు మూత పడిపోతున్నాయని పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసిన పత్తిని ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపితే జిన్నింగ్ మిల్లుల యజమానులు దానిని కొనుగోలు చేసి దూదిగా మార్చుతారని పిటీషన్‌లో వివరించారు. సీసీఐ కంపెనీస్ చట్టం-1956ను పూర్తిగా ధిక్కరించిందని అందుకు పూర్తి బాధ్యత షేర్ హోల్డర్స్‌దేనని పేర్కొన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీస్ చట్టాన్ని అతిక్రమించి చెల్లింపులు చేసిన కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీసీఐ మాజీ మేనేజర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీస్ చట్టపరంగా చేయాల్సిన వ్యాపార లావాదేవీలను మించి నిర్ణయాలు తీసుకునే అధికారం సీసీఐకి లేదని పేర్కొన్నారు. పత్తిని కొనుగోలు చేసి పత్తిని మాత్రమే విక్రయించాలన్న నిబంధనను పాటించకపోవడం కంపెనీస్ చట్టంలోని సెక్షన్ 245 ప్రకారం పరిమితికి మించి, చట్టాన్ని మించి (అల్ట్రా వైర్స్)గా భావించాలని కోర్టును అభ్యర్థించారు. కౌంటర్ దాఖలు చేయాలని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో పాటు, ఇతర ప్రతివాదులను ఆదేశిస్తూ ఈ నెల 6 కు కేసును హైకోర్టు వాయిదా వేసింది.

కమీషన్ ఏజంట్ల లైసెన్సుల పునఃపరిశీలన

● నాలుగు బృందాలను నియమించిన మార్కెటింగ్ డైరెక్టర్
● 7లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం
● మెమోలో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రస్తావన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు)లో కమీషన్ ఏజంట్స్ లైసెన్సుల ప్రొప్రయిటర్ల మార్పులో జరిగిన అక్రమాలపై పరిశీలన చేసేందుకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత నాలుగు బృందాలను నియమించారు. ఈ నెల 30న 'ఆంధ్రజ్యోతి' గుంటూరు జిల్లా ఎడిషన్‌లో 'తీసుకోవడం... అమ్ముకోవడం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని డైరెక్టర్ ప్రస్తావిస్తూ మెమో విడుదల చేశారు. ఒక్కో బృందంలో సెలెక్షన్ గ్రేడ్ స్థాయి సెక్రెటరీ, మరో అసిస్టెంట్ సెక్రెటరీని నియమించారు. ఈ నాలుగు బృందాలను పర్యవేక్షించే బాధ్యతలను మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ని నియమించారు. వారం వ్యవధిని ఇచ్చిన కమిషనర్ అన్ని లైసెన్సులను పరిశీలన చేసి తనకు నివేదిక అందజేయాలని మెమోలో స్పష్టంగా పేర్కొన్నారు. దాంతో నాలుగు టీంలు గుంటూరు మిర్చియార్డుకు చేరుకొని ప్రొప్రయిటర్ పేర్ల మార్పులను పరిశీలిస్తున్నారు.

వైసీపీ హయాంలో...

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో విచ్చలవిడిగా కమీషన్ ఏజంట్స్ లైసెన్సుల్లో ప్రొప్రయిటర్ల పేర్లు మార్పులు జరిగాయి. ఒక్కో పేరు మార్పు చేసినందుకు రూ. లక్షన్నర నుంచి రూ. 3 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలా దాదాపుగా 282 లైసెన్సుల ప్రొప్రయిటర్ల పేర్లు మార్పులు జరిగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్ కూడా ఇటీవల జరిగిన విచారణలో ప్రొప్రయిటర్ల పేర్ల మార్పుల్లో అవినీతి జరిగినట్లు ధ్రువీకరించి ప్రభుత్వానికి నివేదించింది. అలానే గత నెల 5న రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు నిర్వహించిన సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రాగా అన్ని లైసెన్సులను పునఃపరిశీలన చేయిస్తామని ప్రకటించారు. ఆ మేరకు మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

కమిటీల్లో నియమితులైన అధికారులు వీరే...

మొదటి కమిటీకి తెనాలి ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జేవీ సుబ్బారావు, సహాయకుడిగా కూచినపూడి ఏఎంసీ అసిస్టెంట్ సెక్రెటరీ జీహెచ్ ఎలహానన్, చిలకలూరిపేట ఏఎంసీ సూపర్‌వైజర్ వి.నరసింహారెడ్డిని నియమించారు. రెండో కమిటీకి కృష్ణా జిల్లా గుడివాడ ఏఎంసీకి చెందిన సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వి. భాస్కరరావు, సహాయకుడిగా పొన్నూరు ఏఎంసీ గ్రేడ్-2 సెక్రెటరీ మురళీధర్, సూపర్‌వైజర్ అవినాష్, మూడో కమిటీకి చిలకలూరిపేట ఏఎంసీ సెలెక్షన్ గ్రేడ్ యూ యోగేశ్వరరావు, సహాయకులుగా కొండేపి అసిస్టెంట్ సెక్రెటరీ జీవీ రవికుమార్, ఫిరంగిపురం ఏఎంసీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, నాల్గో కమిటీకి రేపల్లె ఏఎంసీ గ్రేడ్-3 సెక్రెటరీ జి.వేణుగోపాల కృష్ణ, సహాయకులుగా కంకిపాడు అసిస్టెంట్ సెక్రెటరీ పి.అప్పారావు, వేమూరు సూపర్‌వైజర్ ఎస్.అంజిబాబుని నియమించారు. కాగా మార్కెట్ కమిటీలో ఎన్ని దుకాణాలున్నాయి, వాటిల్లో ఇతరులకు లీజుకు ఇచ్చినవి ఎన్ని, కమీషన్ ఏజంట్ లైసెన్సులు, వేమెన్ లైసెన్సుల వివరాలతో కూడిన నివేదికని ఇప్పటికే సెక్రెటరీ ఆంజనేయులు సమర్పించారు. ఈ నేపథ్యంలో సెక్రెటరీ అందజేసిన నివేదికని క్రాస్ చెక్ చేయాల్సిందిగా డైరెక్టర్ ఆదేశించడం యార్డులో కలకలం రేకెత్తిస్తుంది.

కోల్డ్ స్టోరేజ్ గుమస్తా రూ.7 కోట్లతో పరార్


రైతు సంఘం నాయకులతో బాధిత శనగ రైతులు

చిలకలూరిపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంతంలో జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక కోల్డ్ స్టోరేజ్‌లో పనిచేసే నాగరాజు అనే ఉద్యోగి చిలకలూరిపేట, యద్దనపూడి, మార్టూరు మండలాల్లోని సుమారు 70 మంది రైతులను సుమారు రూ.7 కోట్ల మేర మోసం చేసినట్టు బాధిత రైతులు గురువారం ఆరోపించారు. రైతులు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులను ఆశ్రయించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు వి.కృష్ణయ్య, రైతు సంఘం సీనియర్ నాయకుడు జి.చలమయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, సీఐటీయూ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు బి.హనుమంతురావును కలిసి జరిగిన మోసాన్ని వివరించారు. తమ వద్ద శనగలు కొని 15 రోజుల్లో డబ్బు చెల్లిస్తానని చెప్పి నాగరాజు పరారయ్యాడని తెలిపారు. సేకరించిన శనగలను సమీపంలోని పప్పు మిల్లుకు తరలించి అమ్మకం చేసుకుని నగదు వసూలు చేసుకుని కుటుంబంతో సహా పరారైనట్టు బాధిత రైతులు వాపోయారు. సమస్యను నాయకులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా తమకు న్యాయం జరగలేదని రైతులు వివరించారు. ఈ సమస్యపై ఒక ఉద్యమ కార్యాచరణకు ప్రణాళిక రూపొందిస్తామని అన్నారు. రైతులకు అండగా ఉంటామని అన్నారు. సమస్యను నాలుగైదు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని రైతు సంఘం నాయకులు ప్రకటించారు.

ఎన్జీ రంగా యూనివర్సిటీ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ డైరీ, క్యాలెండర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు గురువారం సచివాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ శారద జయలక్ష్మి, పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టులో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు అందరూ హాజరయ్యారు. హైకోర్టు ఉద్యోగుల సంఘానికి చెందిన క్యాలెండర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. 25 కేజీల కేకును కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్‌లు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కె.సురేంద్రనాథ్, కార్యదర్శి ఎం.ఎలీషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నాగార్జున కొండను సందర్శించిన విదేశీ బౌద్ధ పరిశోధకులు


మ్యూజియంలో విదేశీ బౌద్ధ పరిశోధకులు

మాచర్ల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియా, హాంకాంగ్, తైవాన్ దేశాలకు చెందిన బౌద్ధ పరిశోధకులు గురువారం నాగార్జున కొండను సందర్శించారు. కొండపై గల మ్యూజియంలోని బౌద్ధ శిల్పాలు, శాసనాలు, శ్రీ చేత్యము తదితర వాటిపై పురావస్తు పరిశోధకుడు, బుద్ధవనం కన్సల్టెంట్, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. కొండను సందర్శించిన వారిలో న్యూజిల్యాండ్‌కు చెందిన ప్రొఫెసర్ సారా, ఆస్ట్రేలియా ప్రొఫెసర్ జాఫ్రియా, హాంకాంగ్, తైవాన్లకు చెందిన ముగ్గురు పరిశోధకులు ఉన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు డీఆర్ శ్యాం సుందరరావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య


నాగరాజు(ఫైల్)

నగరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమట్లపూడి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దారుణ హత్య జరిగింది. గ్రామానికి చెందిన లుక్కా నాగరాజు(43)ను అదే గ్రామంలో చిరువ్యాపారం నిర్వహించే భాస్కరుని సాంబయ్య అనే వ్యక్తి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేశారు. నాగరాజు భార్య శిరీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నగరం ఎస్‌ఐ బండి భార్గవ్ హత్యకు సంబంధించి దర్యాప్తును వేగవంతం చేస్తామని చెప్పారు. మృతుడికి భార్య, అమ్మాయి, అబ్బాయి, తండ్రి లుక్కా గుడారంకయ్య ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కాకుమాను, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకుమాను మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో యుగకీర్తి గురువారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాలకు సంబంధించిన తీర్మానాల పేజీలను మినిట్స్ పుస్తకం నుంచి చించేశారు అని ఎంపీడీవో యుగకీర్తి జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పుస్తకంలో 7వ పేజీ నుంచి 270 పేజీల వరకు చించి వేసి పేజీలు మార్చి ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలో ఏవో సెలవులో ఉండడంతో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ పుస్తకాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీడీవో ఫిర్యాదు మేరకు జిల్లా డిప్యూటీ సీఈవోల బృందం గత నెల 23 నుంచి 26 వరకు కార్యాలయంలో మినిట్స్ పుస్తకంలో పేజీల చించివేతపై దర్యాప్తు చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ మేరకు వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొలకలూరు రైల్వేస్టేషన్ వద్ద గురువారం జరిగింది. రైల్వే ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం కొలకలూరు రైల్వేస్టేషన్ సమీపంలో నివాసం ఉండే మోదుకూరి విజయ్‌కుమార్ (45) గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న రైలును గుర్తించకుండా పట్టాలు దాటుతున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపు వెళ్లే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వినికిడిలోపం ఉండటంతో ట్రైన్ సౌండ్ వినిపించక అప్రమత్తంగా లేకపోవడంతో ఈ ఘటన జరిగి ఉండవచ్చని బంధువులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 569.80 అడుగులు ఉంది. ఇది 256.07 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9019 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8193 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,736 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 49,648 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 38,023 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

45,404 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 47,491 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,404 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	13000	334	7500	13700
నెంబరు. 5	8300	11500	నెంబరు.5	8000	11200
273	9500	11200	273	9000	10500
341	8000	15000	341	7500	12000
4884	8300	11000	4884	12500	12500
సూపర్ 10	8600	8600	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	8500	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	11600
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	15600	15600
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	9500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పెన్షనర్లంతా జీవనపత్రాలు సమర్పించాలి

● జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఏ జగన్నాథరావు

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెన్షనర్లందరు తమ జీవనపత్రాలు (లైఫ్‌సర్టిఫికెట్) సమర్పించేందుకు అన్ని జిల్లాలోని అన్ని ఖజానా కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు బాపట్ల జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఎ.జగన్నాధరావు తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ చేసి జిల్లాలోని ఖజానా కార్యాలయాల ద్వారా పింఛను పొందుతున్న ప్రతిఒక్కరు ఫిబ్రవరి 28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించనవారి పెన్షన్‌లు ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిలుపుదల చేస్తామన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

భట్టిప్రోలు(కొల్లూరు), జనవరి 2(ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్ఠి కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు అబ్బరాజు సాంబశివరావు తెలిపారు. మొదటి విడతలో 10మంది మహిళలకు మూడు నెలలపాటు శిక్షణ అందిస్తామన్నారు. బొడ్డు నాగమణి మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, వంగర బాబూజీ, మహిళలు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారి సన్నిధిలో సినీగాయకుడు మనో దంపతులు



మనోదంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈవో నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో ప్రముఖ సినీగాయకులు మనో దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం సతీసమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి మనో దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. మనో అమ్మవారికి స్తోత్రాన్ని ఆలపించారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

త్రిముఖ దేవాలయాల ఈవోగా నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చందోలు త్రిముఖ దేవాలయాలకు ఆరోసారి దేవదాయశాఖ కార్యనిర్వాహణాధికారిగా జీ నరసింహమూర్తి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన కె. నాగేశ్వరరావు డిసెంబరు 31న ఉద్యోగ విరమణ చేశారు.

మండల వ్యవసాయాధికారిగా లక్ష్మీప్రసన్న

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 2(ఆంధ్రజ్యోతి): భట్టిప్రోలు మండల వ్యవసాయాధికారిగా లక్ష్మీప్రసన్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏవోగా పనిచేస్తున్న జి.మీరయ్య ఏలూరు ఏవో విజిలెన్స్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అమృతలూరు ఏవోగా విధులు నిర్వహించిన లక్ష్మీప్రసన్న బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మాజీ సైనికుడి మృతికి ప్రముఖుల సంతాపం

బాపట్ల జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు జాలాది జోషిబాబు హఠాన్మరణానికి మాజీసైనిక సంక్షేమ సంఘం నాయకులు సంతాపం తెలియజేశారు. గురువారం కొండుభొట్లపాలెంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు జాతీయ జెండా కప్పి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘనాయకులు పుట్టా ఆదిశేషారెడ్డి, పువ్వాడ యలమంద, దుర్గారావు, చిన తిరుపతిరావు, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొని సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

భర్త కనిపించటంలేదని పోలీసులకు ఫిర్యాదు

పిట్టలవానిపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చందోలు పంచాయతీలోని నదీముల్లాపాలెంకు చెందిన మహమ్మద్ సిరాజ్ ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన భార్య మహమ్మద్ ఫర్హానా గురువారం చందోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. కనిపించకుండాపోయిన మహమ్మద్ సిరాజ్ ఆచూకీ తెలిపిన వారు 9440900871కు, చందోలు పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

● ఎస్పీ తుషార్ డూడీ అభినందనలు

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి ప్రాణాలను బాపట్ల పట్టణ పోలీసులు కాపాడారు. హైదరాబాద్‌లోని బంజరాహిల్స్ ప్రాంతంలో పనులు చేసుకొని జీవించే చల్లా శ్రీను వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతో గురువారం బాపట్ల వచ్చి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. దీంతో అతడి బంధువులు బాపట్ల పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఆర్ అహ్మద్‌జానీ స్పందించి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి అతడిని గుర్తించి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. యువకుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వెదుళ్ళపల్లి ఎస్‌ఐ జనార్ధనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని వృక్షనగర్ చర్చి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారన్నారు. మృతుడి ఒంటి మీద నల్లగల్ల చొక్క, బ్లూ రంగు లుంగీ ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పంటపొలంలో మృతదేహం

నగరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలో రాధాస్వామిసత్సంగ్ సమీపంలో కట్టిహరిబాబు(55)మృత దేహం లభించింది. ఎస్‌ఐ భార్గవ్ వివరాల ప్రకారం హరిబాబు చీరాల నుంచి ఈదుపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఆ సమయంలో మద్యం తాగి పొలంలో మృతి చెందినట్లు తెలిపారు. గురువారం స్థానికులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలి

● వీక్షణ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి 15 వేల రూపాయల పింఛను పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటీకృష్ణబాబు రాజధాని నుంచి కలెక్టర్‌కు వీక్షణ సమావేశంలో వివరించారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందేవారిని తొలిగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందులో భాగంగా పరిశీలించబోతున్నామని వివరించారు. ఇందు కోసం వైద్యబృందాలను నియమిస్తామన్నారు. సదరన్ ద్వారా జారీ చేసిన ధ్రువీకరణపత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. పరిశీలన కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేకయాప్‌లో వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్య బృందాలకు సహాయసహకారాలు అందించటానికి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. వారి ద్వారా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారించాలన్నారు. సోమవారం నుంచి విచారణ ప్రక్రియ ప్రారంభించాలని దీనికి సంబంధించిన మార్గదర్శకాలు పంపుతామన్నారు. బృందాలను పర్యవేక్షించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

● దరఖాస్తులు చేసుకున్న మంచం పట్టిన వ్యాధిగ్రస్తుల దరఖాస్తుల విచారణకు అనుమతులివ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి ప్రత్యేక ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి కోరారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విచారణపై పలుసూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1582మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన కేటగిరిలో 15వేల రూపాయలు చొప్పున ఫించన్ పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విచారణ పగడ్బందీగా నిర్వహించాలన్నారు.

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు

పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం దివ్యాంగుల పింఛను పంపిణీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో జరిగిన దివ్యాంగుల పింఛన్ల సర్వేపై ఆరా తీశారు. జిల్లాలో ప్రతినెల పింఛన్ల కింద రూ.95కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. పూనూరులో జరిగిన సర్వే మాదిరిగా జిల్లా మొత్తం సర్వే జరిపితే 18శాతం పింఛన్లు తగ్గుతాయన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. పింఛన్ల పంపిణీపై ఐవీఆర్ఎస్ ద్వారా రాష్ట్ర మొత్తం మీద సమీక్ష నిర్వహించారన్నారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని 13 శాతం మంది తెలిపారన్నారు. 9శాతం మంది ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వటంలేదని, 11శాతం మంది అధికారి ప్రవర్తన బాగాలేదని తెలిపారన్నారు. మండల ప్రత్యేకాధికారులు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి అవినీతికి పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో విజయమ్మ, జిల్లా కోఆర్డినేటర్ శేషుబాబు, జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

రేపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుడ్డికాయలంక, ఉప్పూడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన వందలాది భూసమస్యలను పరిష్కారం చేస్తున్నామని ఆన్‌లైన్ సమస్య ఉన్న వాటిని పరిశీలించి పది హేను రోజుల్లో పరిష్కారం చేస్తున్నామన్నారు. అడంగల్‌లో పేర్లు లేని వాటిని పరిశీలించి సంబంధిత వీఆర్వోలకు అందజేసి పరిష్కారమయ్యేలా చేస్తున్నామన్నారు.

● **కొల్లూరు** : రెండు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని రావికంపాడు, క్రాప గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

పేరలి సర్పంచ్ మల్లెల వెంకటేశ్వరరావు ఎన్నిక రద్దు

● గొర్రెముచ్చు వీరయ్య బాధ్యతలు స్వీకరించాలని కోర్టు ఉత్తర్వులు

కర్లపాలెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరలి సర్పంచిగా గెలుపొందిన మల్లెల వెంకటేశ్వర్లు ఎన్నిక చెల్లదని, ఎన్నికను రద్దు చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారని డీపీవో ప్రభాకరరావు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో మల్లెల వెంకటేశ్వర్లు మోసం చేసి గెలుపొందారని ఓటర్ కార్డులో మల్లెల ఆదాం అని ఉండగా నామినేషన్‌లో వెంకటేశ్వర్లుగా చూపించి ఎన్నికల్లో గెలిచారని గొర్రెముచ్చు వీరయ్య జిల్లా కోర్టులో కేసు వేశారు. సర్పంచి వెంకటేశ్వర్లు కోర్టులో తన పేరు నిరూపించుకోనందున, తప్పుడు ధ్రువపత్రాలు అని తేలిన పిమ్మట కోర్ట్ ఎన్నిక రద్దు చేసి, తరువాతి స్థానంలో ఉన్న వీరయ్యని సర్పంచిగా నియమిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందని డీపీవో వివరించారు. జిల్లా కోర్టు ఉత్తర్వులను అమలుచేయాలని కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు ఉత్తర్వులను వెంకటేశ్వర్లు, వీరయ్యలకు గురువారం అందజేశామని ఆయన తెలిపారు. సర్పంచిగా వీరయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారని వివరించారు.

పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎంసీ కృషి చేయాలి : ఎంఈవో

కర్లపాలెం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి యాజమాన్య కమిటీవారు కృషి చేయాలని ఎంఈవో ఎం మనోరంజిని తెలిపారు. గురువారం మండలస్థాయిలో ఎస్‌ఎంసీకి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంవీ రాజుపాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఎంఈవో-2 విజయశ్రీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కమిటీ కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన

బాపట్లరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలపై విద్యార్థి దశ నుంచే పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని బాపట్లటౌన్ సీఐ అహ్మద్‌జాని అన్నారు. గురువారం బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సైబర్‌క్రైమ్, యాంటీ ర్యాగింగ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగియుండాలని, హెల్మెట్ ధరించి మాత్రమే వాహనం నడపాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీఈ జీకే మూర్తి, కళాశాల సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రానికి రిఫ్రజిరేటర్, ఏసీ అందజేత

రేపల్లె, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రెడ్‌క్రాస్ ద్వారా రక్తాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతూ విశేష సేవలను అందిస్తున్నారని ఆక్వా పారిశ్రామికవేత్త దండుప్రోలు పిచ్చియ్య అన్నారు. గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో తండ్రి దండుప్రోలు పెద్దసుబ్బారావు జ్ఞాపకార్థం రూ.50వేలు విలువ చేసే రిఫ్రజిరేటర్, ఏసీని రెడ్‌క్రాస్ సిబ్బందికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ తీర ప్రాంతంలోని బాపట్ల, కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, నాగాయలంక,కోడూరు పరిసర ప్రాంతాలకు రెడ్‌క్రాస్ ద్వారా రక్తాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మోపిదేవి వీర్రాజు, దేవగిరి రవి, బి.అమర్‌నాథ్, అడుసుమల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల కులగణన షెడ్యూల్ విడుదల

చెరుకుపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎస్సీల కులగణన సోషల్ ఆడిట్ రివైజ్ షెడ్యూల్‌కు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని సచివాలయాల్లో కూడా షెడ్యూల్ కులాల వారీ వివరాల జాబితా ప్రకటించారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే సంబంధిత గ్రామ సచివాలయాల్లో వీఆర్వో వద్ద గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని ఇందుకు తుదిగడువు జనవరి 7వతేదీ అని తెలియజేశారు.

విజ్ఞాన ప్రదర్శనలతో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనల వల్ల విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిజ్ఞానం పెంపొందుతుందని ఎంఈవో ఎం దేవరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక టీఎం రావు హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. వ్యక్తిగత విభాగంలో వెల్లటూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సురేష్ రూపొందించిన ప్రోబ్లమ్ సాల్వింగ్ రోబో, గ్రూపు విభాగంలో టీఎం రావు హైస్కూల్‌కు చెందిన సమ్ ఆఫ్ ఇంటర్నల్ యాంగిల్స్ టీచర్స్ విభాగంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గైడ్ ప్రదర్శనలో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ జాకబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందించాలి

● ఎంపీ కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాలు లేకపోవటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని జనసేనపార్టీ దివ్యాంగుల నాయకులు గోగన ఆదిశేషు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు వివరించారు. దివ్యాంగుల నాయకులతో గురువారం ఆయన ఎంపీని కలిసి సమస్యలు తెలియజేశారు. పరికరాలు లేక దివ్యాంగులు బయటకొచ్చి పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అలింకో ఫౌండేషన్‌వారితో క్యాంప్‌లు ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఉపకరణాలు, బ్యాటరీ వాహనాలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ళు, వీల్‌చైర్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల కోసం 10 సెంట్ల స్థలంలో కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కంది వెంకటరెడ్డి, మౌలాలి, వీర్రాజు, నాగమల్లేశ్వరరావు,శ్రీనివాసరావు తదితరులున్నారు.

కార్యకర్తల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



మృతి చెందిన కార్యకర్త కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, మురళీకృష్ణ తదితరులు

కొల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పరామర్శించారు. గురువారం మండలపరిధిలోని తిప్పలకట్ట గ్రామంలో సీనియర్ మండే ఆశీర్వాదం కుమారుడు కిషోర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన దివి అనసూయమ్మ మృతి చెందగా వారి కుటుంబసభ్యులను కూడా పరామర్శించి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, దివి చంటి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండ

చుండూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలమైన పునాదులకు మొదటి నుంచి కార్యకర్తల ఆదరణ కారణమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం చుండూరులో జరిగిన గుదేటి సీతారామరెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతారామిరెడ్డి కుటుంబం ఆ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. పార్టీ మొదటి నుంచి కార్యకర్తలకు అండగా నిలవడం వల్లనే రాష్ట్రంలో ఏ పార్టీకి లేనంత కార్యకర్తల బలం టీడీపీకి ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తమ్మా శివారెడ్డి, కుర్రి వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి, బాలకోటిరెడ్డి, ప్రసాద్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్ గవర్నర్‌కు మాజీ ఎమ్మెల్సీ సతీష్ శుభాకాంక్షలు

బాపట్ల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): బిహార్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆరీఫ్ మహమ్మద్‌ఖాన్‌ను గురువారం మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బిహార్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.


తెనాలి: పెదరావూరు-వేమూరు రోడ్డుపై కమ్మేసిన పొగ మంచు


సత్తెనపల్లి పట్టణంలోని రహదారిపై దట్టంగా కప్పేసిన పొగమంచు

ముత్యమల్లే మెరిసిపోయే
మంచు తీగ

- కొత్త సంవత్సరంలో మంచు అందాలు
- పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి
- ముత్యాలను తలపించేలా మంచు సోయగాలు

తెనాలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాలపై మంచు దుప్పటి కప్పిందా అన్నట్లు... తెల్లని మేఘాలు అలముకున్నట్టు... ఎటుచూసినా పొగ మంచే. దారి ఎటు మలుపుతిరుగుతుందో! ఎదురుగా ఏ వాహనం వస్తుందో కూడా కనిపించనంత దట్టమైన మంచు తుంపర్లు. కొత్త సంవత్సరంలో మంచు కనువిందు చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు మంచు గ్రామాలను, పట్టణాలను కమ్మేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఏ రోడ్డు చూసినా దారి కనిపించనంతగా పొగ కమ్మేస్తే, తెనాలి రైల్వే స్టేషన్‌కూడా మంచు దుప్పటి కప్పుకుంది. ఉదయాన్నే వాహనాలపై వెళ్లేవారికి కాస్తంత అసౌకర్యంగా పరిస్థితి ఏర్పడితే, గ్రామాల్లో మాత్రం మంచు సోయగాలు కనువిందు చేశాయి. పొలాల్లో చెట్లపై, పుష్పాలపై మంచు బిందువులు ముత్యాల్లా మెరిసిపోతుంటే, సాలీడు కట్టుకున్న గూడుకూడా ముత్యాల హారంలా ఎంతో అందంగా కనిపించింది. గడ్డి పువ్వులపైనా మంచు సోయగాలు కనువిందే చేశాయి. చెట్ల ఆకులు పులకించేలా మంచు తడిపేసింది.


తెనాలి రైల్వే స్టేషన్‌లో దట్టంగా మంచు కమ్మేయటంతో కనిపించని ప్లాట్‌ఫారంలు


పిడుగురాళ్ల బైపాస్ రోడ్డుపై మంచు కప్పేయగా లైట్ల వెలుతురులో వెళుతున్న వాహనాలు


ఓ గడ్డిజాతి మొక్కకు పూసిన పువ్వు నూగుపై మంచు బిందువులు తెనాలి


తెనాలి: మంచుతో మెరిసిపోతున్న సాలీడు గూడు

తెనాలి

దువ్వెన కాయగా చెప్పుకునే పువ్వుపై మంచు ముత్యాల సోయగం


జొన్న జాతి కంకులపై మంచు బిందువులు


గడ్డిపోచకున్న పువ్వుపైనా మంచు ముత్యాలు తెనాలి

బాపట్ల వాసి ఖాదర్‌వలి దక్షిణ తీసుకోని యోగాచార్యుడు. వేల మంది చిన్నారులకు యోగాలో ఉచిత శిక్షణ ఇచ్చే ఆయన క్రమశిక్షణ విషయంలో మాత్రం తగ్గరు. ఒకప్పుడు బాడీ బిల్డింగ్, కబడ్డీలో కూడా ఆయన శిక్షణ ఇచ్చేవారు. 1961లో 'మిస్టర్ గుంటూరు', 1967లో 'మిస్టర్ ఆంధ్రా'గా ఎంపికైన ఆయన యోగా ప్రస్థానం గురించి తెలుసుకోవాల్సిందే.

తొమ్మిది పదుల్లోనూ యోగా

- తరగని ఉత్సాహం
- అరవై ఏళ్లుగా ఉచిత శిక్షణ
- ప్రతిఫలం కోరని యోగాచార్యుడు ఖాదర్‌వలి


మయూరాసనంలో ఖాదర్‌వలి (ఫైల్)


తొమ్మిది పదులు వయసు దాటినా ఇంట్లో బెడ్‌పై నుంచే చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ఖాదర్‌వలి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
ఆయన వయసు తొంభై రెండేళ్లు. ఆరు దశాబ్దాలుగా చిన్నారులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్నారు. అదీ కూడా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా. అదే తనకు ఆనందాన్ని ఇస్తుం దని చెబుతున్న, దక్షిణ తీసుకోని ఆ యోగాచార్యుడు పేరు ఖాదర్‌వలి. బాపట్ల పట్టణ పరిధిలోని ఉప్పరపాలెం నివాసి ఖాదర్ వలి యోగ ప్రస్థానం తెలుసుకుందాం. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా సేవలందించారు. తొలుత బిల్ కలెక్టర్‌గా తర్వాత వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. స్వస్థలమైన బాపట్లలో యూడీసీగా చేస్తూ పదవీవిరమణ చేశారు. ఉద్యోగ నిమిత్తం ఎక్కడకు వెళ్లిన అక్కడ పదిమంది చిన్నారులను కూడగట్టి వారికి యోగాలో శిక్షణ ఇవ్వడమే ఆయన వ్యాపకం. తెనాలి పరిధిలోని పెరవలిపాలెంలో దాసరి నరసింహారావు వద్ద శిష్యరికం చేసిన ఖాదర్ వలి యోగా నేర్చుకున్నారు.

వేల మంది చిన్నారులకు ఉచితంగా

1965 నుంచి ఆయన యోగా ప్రస్థానం మొదలైంది. తొలుత ఇంటి దగ్గరే ఆసక్తి గల పిల్లలకు శిక్షణ ఇచ్చేవారు. ఆ తర్వాత బడి ప్రాం గణాలను వేదికగా చేసుకుని ఆసనాలలో తర్ఫీదు ఇచ్చేవారు. ఈ ఆరు దశాబ్దాల ప్రస్థానంలో వేల మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఖాదర్‌వలి దగ్గర శిక్షణ పొందిన పిల్లలు ఎంతోమంది జాతీయ వేదికలపై తమ ప్రతిభను చాటారు. నేషనల్ యోగా కాంపిటీషన్స్‌లో సత్తా చాటిన బాపట్లకు చెందిన విద్యార్థిని స్నిగ్ధతో పాటు మరెంతో మంది ఆయన దగ్గర శిష్యరికం చేసిన వారే. నిన్నమొన్నటి వరకు కూడా ఆయన ఇంటి దగ్గర 50 మంది చిన్నారులు యోగా శిక్షణ కోసం వచ్చేవారు. ఖాదర్ వలి కాలుకి ఇటీవలే శస్త్ర చికిత్స జరిగింది. ఇప్పుడు కూడా రోజూ పదిమంది చిన్నారులకు ఆసనాలు నేర్పిస్తున్నారు.

బాడీ బిల్డింగ్, కబడ్డీలోనూ...

యోగాతో పాటు బాడీ బిల్డింగ్, కబడ్డీలో కూడా ఖాదర్ వలి శిక్షణ ఇచ్చేవారు. గతంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. 1961లో 'మిస్టర్ గుంటూరు'గా ఎంపిక కాగా, 1967లో యూపీలోని అలీఘడ్ యూనివర్సిటీలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో 'మిస్టర్ ఆంధ్రా'గా ఎంపికయ్యారు. ఆరు దశాబ్దాల ప్రస్థానంలో ఎన్నో పురస్కారాలు ఆయన్ని వరించాయి. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆయనకు జీవితకాల సాఫల్య క్రీడా పురస్కారం-2024ను అందించింది. వీటితోపాటు ఎన్నో క్రీడా అకాడమీలు ఆయనను సత్కరించాయి.

యార్డు ప్రక్షాళనకు శ్రీకారం

- పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- ఇతర యార్డుల అధికారులకు స్థానం
- రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత



గుంటూరు మిర్చియార్డు

గుంటూరు సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన గుంటూరు మిర్చియార్డు ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. రైతు ప్రయోజనాలకు ఎక్కడా భంగం వాటిల్లకుండా నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. గత ఐదేళ్లలో మిర్చియార్డులో రూ. 347 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన నేపథ్యంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కొత్త చర్యలకు ఉపక్రమించింది. ఆ వివరాలను రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. మిర్చియార్డులో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రతి రోజూ నివేదిక తెప్పించుకుని వాటిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సీజన్ ఆరంభం నాటికి పూర్తి స్థాయి మార్పులకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు యార్డులో సమీక్ష నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. వాటి అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. యార్డులో జరుగుతున్న కొనుగోలు, అమ్మకాల ప్రక్రియలో అవినీతి, అక్రమాలు నిలువరించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అధికారులు ఇచ్చిన నివేదికలను ఈ కమిటీ ప్రత్యేకంగా పరిశీలించి వాస్తవాలను తేలుస్తుందని చెప్పారు. ఈ ప్రత్యేక కమిటీల్లో రాష్ట్రంలోని వివిధ యార్డులకు చెందిన అధికారులను నియమిస్తామని చెప్పారు. బయట వారిని నియమించి నివేదికలు అధ్యయనం చేయటం ద్వారా జవాబుదారీతనం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియ ఒక కొలిక్కి వస్తుందని చెప్పారు. వచ్చే సీజన్‌లో రైతులకు, వ్యాపారులకు ఇబ్బంది లేకుండా పారదర్శకంగా అమ్మకాలు, కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూడటమే తమ ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. .యార్డు కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రక్షాళన చేపడుతున్నామని వెల్లడించారు.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తరువాత చర్యలు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చియార్డులో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత చెప్పారు. విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి చేరిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి మెమో వెలువడిన వెంటనే మార్కెటింగ్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుపై సీసీఐకి లేఖ

రాష్ట్రంలోని పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయమై సీసీఐకి లేఖ రాసినట్లు వెల్లడించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ లేఖ రాశామని చెప్పారు. సీసీఐ కేంద్రాల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా చూసేందుకు వీలుగా ఎటువంటి కెమెరాలు ఏర్పాటు చేయాలి, ఎన్ని కెమెరాలు, ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి వంటి వివరాల కోసం లేఖ రాసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని చెప్పారు.

కలల రాజధానిపై.. కొత్త ఆశలు

(5వ పేజీ తరువాయి)
కొత్త కాంతులు తీసుకు వచ్చారు. రాజధాని అవసరాలకు తగినట్లుగా కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొత్త భవనాల్లో పనులను ప్రారంభించారు. జూలైలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్‌ఐడీ) నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కేంద్ర పెద్దలను ఒప్పించడంతో అదే నెల కేంద్రం బడ్జెట్లో రాజధానికి రూ. 15వేల కోట్ల సహాయం ప్రకటించారు. దీంతో మొత్తం రాజధాని స్వరూపమే మారిపోబోతోందని తేలిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి సహాయం కూడా అందడంతో పనులు ఊపందుకోబోతున్నాయి. ఐకానిక్ భవనాలు, ట్రంకు రోడ్లు, లే అవుట్లకి సంబంధించి రూ. 24,276.83 కోట్లతో చేపట్టే పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటికే సెక్రటేరియట్ పునాదుల్లో నీళ్ల తొలగించే పనులు చేపట్టారు. 4,688 కోట్లు నిర్మాణానికి కేటాయించారు. 250 మీటర్ల ఎత్తులో, 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించనున్నారు. 42.3ఎకరాల్లో శాశ్వత హైకోర్టు భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికల టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. తక్షణ ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని, ఆ తరువాత ప్రాధాన్య క్రమంలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు, ఎన్జీవో భవన సముదాయాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యదర్శుల భవనాలు, అధికారుల అపార్టుమెంట్లు అన్నీ వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ సర్కారు నిర్వాకంతో ఉనికే లేకుండా పోయిన హ్యాపీనెస్ట్ తిరిగి ప్రాణం పోసుకుంటోంది. రూ. 800 కోట్లతో భవనాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

● క్యూ కడుతున్న కేంద్ర సంస్థలు

కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతికి కేంద్ర సంస్థలు క్యూ కడుతున్నాయి. ఎయిమ్స్‌కు కొత్త వైభవం వచ్చింది. సాక్షాత్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాకతో ప్రాధాన్యం మరింత పెరిగింది. ఇండియా పోస్టు, ఇండియన్ నావీ, ఇండియన్ ఆర్మీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సీబీఐ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాగ్, ఆర్బీఐ, ఎంఐడీ, నాబార్డు, ఎస్‌బీఐ, యూబీఐ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌ఐసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి సంస్థలకు గతంలోనే భూములు కేటాయించారు. ఇస్రో రీసెర్చ్ సెంటర్, నేషనల్ పోలీస్ అకాడమీ ఎక్స్‌టెన్షన్ క్యాంపస్, ఆలిండియా సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రీజనల్ కార్యాలయం, ఎన్‌సీసీ అకాడెమీ, ఆర్‌బీఐ, సీఏజీ, సీపీడబ్ల్యూజీ, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, ఇండియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు అనేక కేంద్ర సంస్థలు, 13 అంతర్జాతీయ విద్యాసంస్థలు రాజధాని అమరావతికి రానున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది అమరావతికి మహర్దశ రాబోతోందని తెలుస్తోంది.

● కౌలు కష్టాలకు చెల్లు.. అసైన్డ్ రైతులకు విముక్తి

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజధాని రైతులను కౌలు కష్టాలు వెంటాడాయి. రాజధాని రైతులపై కక్షబూనిన గత ప్రభుత్వం వారికి కౌలు చెల్లించకుండా వేధించింది. మూడేళ్లపాటు కౌలు నిలిపివేసింది. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు బనాయించి కౌలుకు అనర్హులుగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల వార్షిక కౌలు వారికి దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఒక ఏడాది కౌలు కింద రూ. 280 కోట్లు విడుదల చేసింది. రెండో ఏడాది కౌలు కూడా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. సీఐడీ కేసులతో నరకం చూస్తున్న 2,600 మంది రైతులకు కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఈ ఏడాది డిసెంబరుతో వారందరికీ విముక్తి పత్రాలు ఇవ్వడంతో వారికి కూడా కౌలు కష్టాలు తీరబోతున్నాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి అమరావతిలోని ప్రతి రైతు ఇంట సంతోషాల పంట పండబోతోంది.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

మంగళగిరి సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా హైదరాబాద్, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు గోదాదేవి అమ్మవారికి సారెను సమర్పించారు. 18వ రోజైన గురువారం త్రిదండి చినజీయర్‌స్వామి 18వ పాశురాన్ని భక్తులకు వివరించారు. గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించి, భక్తుల కు మంగళా శాసనాలు అందిం చారు. మైహోం గ్రూప్స్ అధినేత జూపల్లి రామేశ్వరరావు కుటుంబ సభ్యులు చినజీయర్‌స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులు, అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి



కొనసాగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల

దేహదారుఢ్య పరీక్షలు

- నేటి నుంచి మూడు రోజులపాటు మహిళా అభ్యర్థులకు పరీక్షలు

గుంటూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. మూడో రోజు గురువారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు 264 మంది హాజరు కాగా, వారిలో 18మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 246మందిలో 166 మంది తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. ఆయా పరీక్షలకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు (ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్) నిర్వహించగా వారిలో 31మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగిలిన 215మందికి 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహించగా 33 మంది అనర్హులు కాగా 182మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. 182మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 68మంది అర్హత సాధించగా 114మంది విఫలమయ్యారు. 182 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 167 మంది అర్హత సాధించగా 15మంది విఫలమయ్యారు. మొత్తం 246మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 166 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా పరిశీలించి, పరీక్షల నిర్వహణ అధికారులకు, అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 3, 4, 6 తేదీల్లో మహిళా అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని, 5న ఆదివారం సెలవు అని ఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగా 3న 530 మందికి, 4వ తేదీ 535 మందికి, 6వ తేదీ 536 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుష అభ్యర్థులకు ఈనెల ఏడో తేదీ నుంచి యథావిధిగా దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు పలువురు అధికారులు పాల్గొన్నారు.


దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

చిన ముంబయి వ్యాపారం 1000 కోట్లు

దేశంలోనే చీరాల రెండో అతిపెద్ద వస్త్ర సముదాయం

•వస్త్ర వ్యాపారానికి కేరాఫ్‌గా గుర్తింపు •సంక్రాంతి పండుగ వేళ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి



మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ ముఖద్వారం

చీరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధి. చీరాలను చినముంబయి అని కూడా పిలుస్తారు. క్షీరపురి అని మరో పేరు కూడా వాడుకలో ఉంది. చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్(ఎంజీసీ మార్కెట్‌గా)కు విశేష ఆదరణ ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఇక్కడకు వస్త్రాల కొనుగోలుకు వస్తుంటారు. సాధారణ వ్యక్తులతో పాటు రిటైల్ విక్రయాలు జరిపే వారు హోల్‌సేల్‌గా కొంటారు. ఏడాదికి సుమారు



వస్త్ర బండిల్స్‌ను దింపుతున్న కార్మికులు

రూ.1000 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు నడుస్తాయి. దుకాణ యజమానులు కాకుండా వెయ్యి మందికి పైగా గుమస్తాలు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం సంక్రాంతి విక్రయాలపై దుకాణదారులు ప్రత్యేక దృష్టి సారించారు.

నిర్మాణం ఎప్పుడు జరిగింది.. ఎన్ని దుకాణాలు ఉన్నాయి

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య సహకారంతో ఎంజీసీ మార్కెట్ పురుడు పోసుకుంది. 1977లో సుమారు 3 ఎకరాల స్థలంలో వస్త్ర దుకాణాల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. స్థలం, దుకాణ నిర్మాణానికి కలిపి ఒక్కొక్కరికీ రూ.19,100 ఖర్చయింది. తొలుత 320 దుకాణాలను నిర్మించారు. నిర్మాణం అనంతరం 1979 మార్చి 19న అప్పటి గవర్నర్ కేసీ అబ్రహం, కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఆ తరువాత 70 దుకాణాలను నిర్మిచారు. దాదాపుగా అన్ని షాపులకు పై అంతస్తులో మరో షాప్ ఉంటుంది. దీంతో సుమారు 750 దుకాణాలున్నాయి.

రోశయ్య ఆశీస్సులతోనే నిర్మాణం

వేముల చంద్రశేఖర్, మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, చీరాల



మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఉన్నంత కాలం ఆయన మాకు అండగా ఉన్నారు. ఆయన ప్రోద్బలం, సహకారంతోనే ఈ మార్కెట్ నిర్మాణం జరిగింది. అదే విధంగా హౌసింగ్ కాలనీ, గుమస్తాల కాలనీ నిర్మాణాలకు ఆయన అందించిన సహకారం ఎప్పటికీ మరువలేం. మార్కెట్ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా నడుస్తోంది. క్రమశిక్షణగా ఉంటాం.

ఎగుమతి.. దిగుమతి

చీరాల వస్త్ర వ్యాపారులు దేశంలో వివిధ ప్రాంతాల్లో వస్త్రోత్పత్తి జరిగే మిల్లుల నుంచి టోకున కొనుగోలు చేస్తారు. సూరత్, అహ్మదాబాద్, వారణాశి, ఈ-రోడ్డు, బెంగళూరు, సేలం తదితర ప్రాంతాల్లో మిల్లుల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఆ సరుకును స్థానికంగా హోల్‌సేల్, రిటైల్‌గా విక్రయిస్తుంటారు.

అతిపెద్ద వస్త్ర దుకాణ సముదాయం

ఎంజీసీ మార్కెట్ దేశంలోనే అతిపెద్ద వస్త్ర దుకాణ సముదాయం. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఉన్న సముదాయం అతిపెద్దది. తరువాత చీరాల ఎంజీసీ మార్కెట్. వీటితో పాటు ఆర్ఆర్ రోడ్డు, కామధేను కాంప్లెక్స్, ఇతర హోల్‌సేల్, రిటైల్ దుకాణాలన్నీ కలిపితే సుమారు 1500 దుకాణాల వరకూ ఉన్నాయి.



పండుగలు, పెళ్లిల సీజన్‌లో భారీ కొనుగోళ్లు

పెళ్లిల్లు, పండుగల సీజన్‌లో వస్త్ర వ్యాపారాలకు అనుకూలం. దసరా, క్రిస్మస్, సంక్రాంతి పండుగలకు ప్రధానంగా గిరాకీ ఉంటుంది. ఇక పెళ్లిళ్ల సీజన్‌లో అయితే సందడే సందడి. కొనుగోలుదారుతో కొట్లు కిటకిటలాడతాయి.

వ్యాపారం.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు

గత 34 సంవత్సరాల నుంచి వినాయక చవితి ఉత్సవాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. మార్కెట్ ప్రధాన ముఖద్వారం వద్ద ఉన్న అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. వ్యాపారంతో పాటు ఆధ్యాత్మికతకు అక్కడ ప్రాధాన్యత ఉంటుంది.

ఏడాదికి రూ.1000 కోట్ల టర్నోవర్.. 1000 మంది గుమస్తాలకు ఉపాధి

ఎంజీసీ మార్కెట్‌లో ఉన్న వస్త్ర దుకాణాల్లో ఏడాదికి రూ.1000 కోట్ల టర్నోవర్ జరుగుతుంది. ఇక ఆర్ఆర్ రోడ్డు, కామధేను కాంప్లెక్స్, ఇతర హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో మొత్తంగా చీరాల నియోజకవర్గంలో ఏడాదికి మరో రూ.1000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఎంజీసీ మార్కెట్‌లో దుకాణ యజమానులు కాకుండా సుమారు వెయ్యి మందికి పైగా గుమస్తాలు ఉపాధి పొందుతున్నారు. ఇతర ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకునే సమయంలో చీరాల ఎంజీసీ మార్కెట్ బైలాపై అవగాహన కల్పించుకుని, తమ కార్యాచరణ రూపొందించుకుంటుంటారు.

వస్త్ర వ్యాపారంతో ప్రత్యేక గుర్తింపు


తాతా కుమారస్వామి, సొసైటీ సెక్రటరీ, చీరాల



వస్త్ర వ్యాపారంలో చీరాలకు ప్రత్యేక స్థానం ఉంది. అన్ని వర్గాల ప్రజల అభిరుచుల మేరకు ఇక్కడ దుకాణాల్లో వస్త్రాలు అందుబాటులో ఉంటాయి. వినియోగదారుల అభిరుచి మేరకు మేం కూడా ట్రెండ్‌ను ఫాలో అవుతుంటాం.

ఒక్కో దుకాణం, ఒక్కో వెరైటీలో...

మేటూరి శేషసాయి, సొసైటీ కార్యవర్గ సభ్యుడు, చీరాల



హ్యాండ్లూమ్, ప్యూర్‌సిల్క్ శారీస్, జెంట్స్ క్లాత్, రెడీమేడ్, జరీ, లుంగీలు, బనియన్లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్, దుప్పట్లు, కార్పెట్ మ్యాట్ తదితరాలకు సంబంధించి ఒక్కో దుకాణం ఒక్కో రకానికి ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుంది. కొనుగోలుదారుల ఆదరణతో ముందుకు సాగుతున్నాం.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

చినగంజాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శీలం రమేష్ హెచ్చరించారు. పెదగంజాం గ్రామ శివారులో గురువారం కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకోగా, పందేం ఆడుతున్న కొందరు తప్పించుకున్నట్లు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద ఉన్న ఒక కోడి, రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ విషయంలో కేసు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో సాగు భూమి ఆన్‌లైన్ విషయంలో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్, కొనుగోలుదారులపై మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మేదరమెట్లకు చెందిన మారిపూడి వెంకటేశ్వర్లు తనకు రావాల్సిన బకాయిపై అదే గ్రామానికి చెందిన నెక్కంటి సుబ్బారావుపై అద్దంకి కోర్టులో దావా వేశారు. విచారణలో భాగంగా న్యాయస్థానం సుబ్బారావుకు చెందిన భూమిని అటాచ్ చేసింది. ఈ విషయాన్ని రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటాచ్‌మెంట్‌లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ మార్చడంతో సబ్ రిజిస్ట్రార్ వద్ద ఐదుగురు రిజిస్టర్ చేయించుకున్నారు. న్యాయస్థానం అప్పటి తహసీల్దార్, వీఆర్వో, అద్దంకి సబ్ రిజిస్ట్రార్, భూమి అమ్మిన వ్యక్తి, రిజిస్టర్ చేయించుకున్న ఐదుగురు వ్యక్తులపై ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు

మేదరమెట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలోని శ్రీ భ్రమర టౌన్ షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు భ్రమర ఎండీ గల్లా రామచంద్రరావు గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రోత్ సెంటర్‌లో నిర్వహించే పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సంబరాలల్లో భాగంగా గంగిరెద్దులు, హరిదాసు పొంగళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలు 8500248669, 8341894434 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. మేదరమెట్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంక్రాంతి పోటీలలో పాల్గొనాలని వారు కోరారు.

పాఠశాల స్థాయి నుంచే పరిశోధనపై అవగాహన ఉండాలి

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన నమూనాలు

పంగులూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్ర పరిశోధనలపై అవగాహన ఉండాలని ఎంఈవో జి.వీరాంజనేయులు అన్నారు. మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈవో ప్రారంభించారు. ఈ సైన్స్ ఫేర్‌లో వ్యక్తిగత విభాగంలో 7, విద్యార్థుల సామూహిక విభాగంలో 8, ఉపాధ్యాయ విభాగంలో 4 ప్రాజెక్టలను ప్రదర్శించారు. సమూహ విభాగంలో బూదవాడ ఉన్నత పాఠశాల బాలికలు సిరి చందన, సుహేన ప్రదర్శించిన ఎర్గోనామిక్ టూల్ ఫర్ లేబర్ సేవింగ్ నమూనా, వ్యక్తిగత విభాగంలో పంగులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సాజిదా ప్రదర్శన, ఉపాధ్యాయ విభాగంలో బూదవాడ రసాయన శాస్త్ర బోధకుడు చంద్రశేఖర్ ప్రదర్శించిన అల్టిమేట్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలుగా ఎంపికైన వారు 3వ తేదీన జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ఎగ్జిబిట్ చేస్తారని హెచ్ఎం అణిత తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, ముప్పవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు సోమశేఖర్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రామకోటిరెడ్డి పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పోటీలతో లక్ష్యాలపై గురి

చీరాలటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పోటీలలో పాల్గొనడం వలన విద్యార్థులకు లక్ష్యాలపై గురి పెరుగుతుందని ఎంఈవో-2 సుధారాణి అన్నారు.పట్టణ పరిధిలోని కేజీబీవీలో మండల స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025 కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండల పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులు పలు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా గీతా యంగ్ సైంటిస్ట్ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, యన్నం యలమందేశ్వరరావు గైడ్ టీచర్‌లుగా విధులు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు అక్షయ, తేజశ్రీ, కల్పనకు ప్రశంసా పత్రాలు అందించారు. వీరు బాపట్లలో శుక్రవారం జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

కలల రాజధానిపై... కొత్త ఆశలు

(5వ పేజీ తరువాయి)

కొత్త కాంతులు తీసుకు వచ్చారు. రాజధాని అవసరాలకు తగినట్లుగా కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కొత్త భవనాల్లో పనులను ప్రారంభించారు. జూలైలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. కేంద్ర పెద్దలను ఒప్పించడంతో అదే నెల కేంద్రం బడ్జెట్లో రాజధానికి రూ. 15వేల కోట్ల సహాయం ప్రకటించారు. దీంతో మొత్తం రాజధాని స్వరూపమే మారిపోబోతోందని తేలిపోయింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి సహాయం కూడా అందడంతో పనులు ఊపందుకోబోతున్నాయి. ఐకానిక్ భవనాలు, ట్రంకు రోడ్లు, లే అవుట్లకి సంబంధించి రూ. 24,276.83 కోట్లతో చేపట్టే పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. ఇప్పటికే సెక్రటేరియట్ పునాదుల్లో నీళ్ల తొలగించే పనులు చేపట్టారు. 4,688 కోట్లు నిర్మాణానికి కేటాయించారు. 250 మీటర్ల ఎత్తులో, 103 ఎకరాల్లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించనున్నారు. 42.3ఎకరాల్లో శాశ్వత హైకోర్టు భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికల టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. తక్షణ ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని, ఆ తరువాత ప్రాధాన్య క్రమంలో ఆలిండియా సర్వీసెస్ ఉద్యోగుల భవనాలు, ఎన్జీవో భవన సముదాయాలను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ కార్యదర్శుల భవనాలు, అధికారుల అపార్టుమెంట్లు అన్నీ వచ్చే ఏడాది అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ సర్కారు నిర్వాకంతో ఉనికే లేకుండా పోయిన హ్యాపీనెస్ట్ తిరిగి ప్రాణం పోసుకుంటోంది. రూ. 800 కోట్లతో భవనాల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

● **క్యూ కడుతున్న కేంద్ర సంస్థలు**

కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతికి కేంద్ర సంస్థలు క్యూ కడుతున్నాయి. ఎయిమ్స్‌కు కొత్త వైభవం వచ్చింది. సాక్షాత్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ రాకతో ప్రాధాన్యం మరింత పెరిగింది. ఇండియా పోస్టు, ఇండియన్ నావీ, ఇండియన్ ఆర్మీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, సీబీఐ, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాగ్, ఆర్బీఐ, ఎంఐడీ, నాబార్డు, ఎస్‌బీఐ, యూబీఐ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, గెయిల్ వంటి సంస్థలకు గతంలోనే భూములు కేటాయించారు. ఇస్రో రీసెర్చ్ సెంటర్, నేషనల్ పోలీస్ అకాడమీ ఎక్స్‌టెన్షన్ క్యాంపస్, ఆలిండియా సర్వీసెస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రీజనల్ కార్యాలయం, ఎన్‌సీసీ అకాడెమీ, ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, సీఏజీ, సీపీడబ్ల్యూజీ, ఎన్టీపీసీ, ఓఎన్‌జీసీ, ఇండియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు అనేక కేంద్ర సంస్థలు, 13 అంతర్జాతీయ విద్యాసంస్థలు రాజధాని అమరావతికి రానున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఏడాది అమరావతికి మహర్దశ రాబోతోందని తెలుస్తోంది.

● **కౌలు కష్టాలకు చెల్లు.. అసైన్డ్ రైతులకు విముక్తి**

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాజధాని రైతులను కౌలు కష్టాలు వెంటాడాయి. రాజధాని రైతులపై కక్షబూనిన గత ప్రభుత్వం వారికి కౌలు చెల్లించకుండా వేధించింది. మూడేళ్లపాటు కౌలు నిలిపివేసింది. అసైన్డ్ రైతుల భూములపై సీఐడీ కేసులు బనాయించి కౌలుకు అనర్హులుగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల వార్షిక కౌలు వారికి దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో ఒక ఏడాది కౌలు కింద రూ. 280 కోట్లు విడుదల చేసింది. రెండో ఏడాది కౌలు కూడా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. సీఐడీ కేసులతో నరకం చూస్తున్న 2,600 మంది రైతులకు కూటమి ప్రభుత్వం విముక్తి కలిగించింది. ఈ ఏడాది డిసెంబరుతో వారందరికీ విముక్తి పత్రాలు ఇవ్వడంతో వారికి కూడా కౌలు కష్టాలు తీరబోతున్నాయి. దీంతో వచ్చే ఏడాది నుంచి అమరావతిలోని ప్రతి రైతు ఇంట సంతోషాల పంట పండబోతోంది.

పకడ్బందీగా..

నాల్గో రోజు పరీక్షలో 188 మంది ఎంపిక

ఒంగోలు క్రైం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో గల పెరేడ్ మైదానం కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 247మంది అభ్యర్థులు హాజరు కాగా 188 మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. మొత్తం 600మంది రావాల్సి ఉండగా 247 మంది హాజరయ్యారు. వీరిలో 188 మంది ఎంపిక కాగా 59 మంది అనర్హులుగా ప్రకటించారు. ఈనెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు.



పరుగు పందెంను పరిశీలిస్తున్న అధికారులు



లాంగ్ జంప్ దూకుతున్న అభ్యర్థి.. దూరాన్ని లెక్కిస్తున్న సిబ్బంది



పోటీలకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు



అభ్యర్థుల పరుగుపందెం

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఆర్య వైశ్యులు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్య వైశ్య నేతలు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆర్య వైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా డి.రాకేష్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆర్య వైశ్యులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని టీడీపీ అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు కోరారు. విజయవాడలో ఆదివారం జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమం ఆహ్వాన పత్రికను గురువారం స్థానిక గీతామందిరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఆర్య వైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు శ్రీరామ్ నాగేశ్వరరావు, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, భోజనపల్లి సత్యనారాయణ, చుండూరి మురళీ సుధాకర్, కౌన్సిలర్ అత్తులూరి రమేష్, పొట్టి వెంకటశివరావు, మామిడి రాంబాబు, సంకా సుబ్రహ్మణ్యం, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, నూకల రామాంజనేయులు, ఆత్మకూరు మస్తానయ్య చామర్తి శ్రీనివాసరావు, ఐతా సత్యనారాయణ పాల్గొన్నారు.

మోసగాళ్ల బారిన పడొద్దు : ఎస్సై



యువకులకు హడల్స్ బహూకరిస్తున్న ఎస్సై శంకరబాబు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులు మోసపూరిత వ్యక్తులబారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఈపూరుపాలెం ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ అన్నారు. కొంత కాలంగా పీఈటీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో సుమారు 50 మంది నిరుద్యోగులు ఖాకీ కొలువుల కోసం సాధన చేస్తున్నారు. ఈక్రమంలో ఎస్ఐ గురువారం ఆ యువకులతో మాట్లాడారు. ఉద్యోగ సాధన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే వీరి సాధన, పడుతున్న శ్రమను గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించడంతో జాండ్రపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బద్ధి శంకరబాబు స్పందించారు. సుమారు రూ.50 వేల విలువైన సాధనకు ఉపయోగపడే హడల్స్‌ను బహూకరించారు. యవకులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

కారంచేడు (పర్చూరు), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలలో గ్రామాల్లో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. గత కొంత కాలంగా మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీరు కదలని పరిస్థితి ఏర్పడింది. పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు నీటితో తీవ్రమైన కంపుతోపాటు, దోమలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కారంచేడు గ్రామంలోని ప్రధాన మురుగు కాలువలో పూడిక తీసే పనులు మొదలుపెట్టారు.



కారంచేడు.. కాలువలో పూడికను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పలువురు ప్రముఖులకు కొండయ్య శుభాకాంక్షలు



మంత్రి గొట్టిపాటికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, జనార్దన్‌రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తదితరులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భగా జ్ఞాపికలను అందజేశారు. ఆయా సందర్భాల్లో చీరాల నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కొండయ్య కోరారు.

నేడు మంత్రి పర్యటన వివరాలు

అద్దంకి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు కొరిశపాడు మండలం పి.గుడిపాడు, అద్దంకి మండలం ధేనువకొండ, బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడులో పాల్గొనున్నారు.

బ్రిడ్జిలపై భయం..భయం!



పాత మద్రాస్ రోడ్డులో పూసపాడు వాగుపై శిథిలమై ఉన్న బ్రిడ్జి



పర్చూరు వాగుపై చిల్లచెట్లతో శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి

- శిథిలావస్థలో వారధులు
- గోడల్లో మొలిచిన చిల్లచెట్లు
- పాత మద్రాసు రోడ్డులోనూ అదే పరిస్థితి
- భారీ వాహనాలు, ప్రయాణికులతో రద్దీ
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు

పర్చూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : భయం..భయంగా ప్రయాణికులు బ్రిడ్జిలపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క బ్రిడ్జి అంచుల్లోని గోడలకు చిల్లచెట్లు కమ్మేశాయి. వానాకాలంలో బ్రిడ్జిపై నీరు చేరి రోజులతరబడి నిలిచి ఉంటుంది. ఇలాగే కొనసాగితే బ్రిడ్జి కూలే ప్రమాదముందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారి రోడ్డు పను లు సాగుతుండడంతో వందల సంఖ్యలో భారీ వాహనాలు ఈబ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. టన్నులకొద్దీ రోడ్డు సామగ్రిని బ్రిడ్జి మీదుగా తరలిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాత మద్రాసు రోడ్డులో ఇంకొల్లు మండలం పూసపాడు వద్ద అర్అండ్‌బీ రహదారిపై బ్రిడ్జి శిథిలమై కూలే దశకు చేరింది. దశకు చేరుకుంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, డైవర్షన్‌తో సరిపెట్టారు. ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం ఊసే లేవు. కొద్దిపాటి వర్షం కురిసినా రాకపోకలు నిలచిపోల్సిందే. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రాకపోకలు సాగించే పర్చూరు - ఇంకొల్లు (పాత మద్రాస్) రోడ్డులో బ్రిడ్జి పరిస్థితి దయనీయంగా మారింది. దీనికి తోడు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డ్రైవర్షన్ రోడ్డు కూడా అస్తవ్యస్తంగా మారింది. అమరావతికి వెళ్లే వారు ఇంకొల్లు - పర్చూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. పర్చూరు ఆయా పట్టణాలకు ప్రధాన కూడలి కావడం, రాజధాని అమరావతికి వెళ్లే మార్గం కూడా కావడంతో ఈ బ్రిడ్జిపై వాహనాల రద్దీ ఎక్కువైంది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పర్చూరు వాగుపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి గోడలను చీల్చుకుంటూ పిచ్చి మొక్కలు వస్తున్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడిపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించిన వాణిశ్రీ

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

జిల్లా అధికారి వాణిశ్రీ

తోటవారిపాలెం(చీరాలటౌన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలతో ఆరోగ్యవంతంగా జీవిస్తారని, ప్రజలు వాటిపై దృష్టి సారించి ముందుకు సాగాలని ఆ శాఖ జిల్లా అధికారి వాణిశ్రీ అన్నారు. గురువారం చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సాగునుద్దేశించి మాట్లాడారు. అలాగే ఆయా రైతులు కేంద్రంలో తక్కువ ధరలకే విక్రయాలు జరుపుతున్న పదార్థాలతో సాగుతో ప్రయోజనముంటుందని సూచించారు. వెలుగు ఏపీఎం మధు మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయ పంటలపై శ్రద్ధ చూపాలన్నారు. ఆ విధంగా పండించిన పంటలనే ఆహారంగా ఉపయోగించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ శ్రీవల్లి, ఎంటీలు భీమరాజు, భారతి, శ్రీనివాస్, పొదుపు సంఘాల మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ

మార్టూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వెంకయ్య ఆశ్రమంలో గురువారం బొమ్మినేని గీతాన్వి పుట్టినరోజు సందర్భంగా తాతయ్య బి వసంతరావు, నాన్నమ్మ వెంకటసుబ్బాయమ్మ పేదలు, వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా చేతులమీదగా వారికి వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ బల్లికురవ చీఫ్ మేనేజరు కే సీనానాయక్, మేనేజరు పీ రవీంద్రబాబు, మార్టూరు మేనేజరు జీవన్‌బాబు పాల్గొన్నారు. అందరికీ ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

హెల్మెట్‌పై అవగాహన



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

మార్టూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్‌ను ఉపయోగించాలని సీఐ ఎం.శేషగిరిరావు సూచించారు. గురువారం మండల పరిధి రాజుపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై తనిఖీ చేసి, వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించనివారికి హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

మార్టూరు, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు తోడళ్లల్లు కొల్లు రాంబాబు, పల్లపు గోపి మృతదేహాలకు గురువారం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం వారిద్దరి మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. దాంతో వారు వాటిని ఒక ప్రైవేటు అంబులెన్సులో విజయవాడకు తీసుకొని వెళ్లారు. బుధవారం మార్టూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాంబాబు, గోపి మృతిచెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు భార్య ఉమ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. పోస్టుమార్టం నిర్వహించిన ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు బొల్లాపల్లి, ధర్మవరం గ్రామాలకు చెందిన బంధువులు, ముఖ్యంగా మహిళలు వచ్చి విలపించారు.



మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు కోసం సస్య రక్షణ చర్యలు చేపాట్టాలని ఏడీఏ ధన్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తెర పురుగు నివారణ కోసం నోవాలురాన్ 5.25 శాతం ఏమామెక్టిన్ బెంజోయేట్ 9 శాతం ఎకరాకు 300 ఎంఎల్ మొవ్వులో పడేలా పిచికారీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతులకు ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏలు సాయిబాబు, మస్తాన్‌రావుతో పాటు మానం స్వాములు పాల్గొన్నారు.

సావిత్రీబాయిపై వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న పలు పాఠశాలల విద్యార్థులు

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సింగరకొండలోని గురుకుల పాఠశాలలో సావిత్రీబాయి పూలే జీవిత చరిత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహించారు. ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, షేక్ మస్తాన్‌రావు, జ్యోతి చంద్రమౌళి, కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రిదేవి పోటీలను పర్యవేక్షించారు.

స్కూళ్ల అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలి

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శిక్షణ



ఎస్ఎంసీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి

వేటపాలెం (చీరాల), జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మండల వనరుల కేంద్రంలో గురువా రం పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ బాధ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్‌లకు ఇచ్చిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా అధికారులు శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పాఠశాలల అభివృద్ధి, వసతుల కల్పన, విద్యా ప్రణాళికకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవోలు జేవీ సుబ్బయ్య, ఐ.పురుషోత్తం, రీసోర్స్ పర్సన్స్ ఎ.సుబ్బారావు, టి.బంగారు నాయుడు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు చెరుకూరి రాంబాబు, డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పంగులూరు : పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజిమెంట్ సభ్యులు భాగస్వామ్యం కావాలని ఎంఈవో-2 జె.వీరాంజనేయులు సూచించారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ చైర్మన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల ప్రగతి, పరిశుభ్రత, మౌలికవసతుల కల్పన విషయంలో ఎస్ఎంసీ చేపట్టాల్సిన చర్యలపై ఆర్పీలు శ్రీధర్‌బాబు, శేషగిరి, రత్తయ్య అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతినిధులు ఈ నెల 4వ తేదీన వారివారి పాఠశాలల్లో ఎస్ఎంసీ సభ్యులందరికీ శిక్షణ ఇవ్వాలని శిక్షణ పర్యవేక్షకులు ఎంఈవో కె.నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరు : పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు భాగస్వామ్యం అయ్యేలా కృషి చేయాలని ఎంఈవో వస్రాంనాయక్ ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం మార్టూరులో విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈవో వస్రాంనాయక్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో యాజమాన్య కమిటీలు పాత్ర కీలకమైనదన్నారు. తరచూ వారితో సమావేశమై స్కూళ్ల అభివృద్ధిపై సమావేశాలు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలును, విద్యార్థుల సంఖ్య ను పెంచాలన్నారు. కార్యక్రమంలో రిసో ర్సు పర్సన్లుగా బి బాల ప్రసాద్, సీహెచ్ శ్రీరామమూర్తి, సూర్యప్రకాష్ వ్యవహరించగా, ఎంఈవో 2 ప్రేమలతతో పాటు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యద్దనపూడి : ప్రజల భాగస్వామ్యంతో యాజమాన్య కమిటీల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని ఎంఈవో గోపి అన్నారు. గురువారం యద్దనపూడిలో విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. రీసోర్సు పర్సన్‌లుగా నాగిరెడ్డి,షఫీబాషా, శ్రీనివాసరావు, సీఆర్పీలు ప్రేమ్‌కుమార్, మస్తానవలి పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, అభివృద్ధిలో ప్రజలు బాగస్వామ్యం కావాలని ఎంఈవో వెంకట్రామయ్య అన్నారు. విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల యాజమాన్య కమిటీలకు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలుడు

పర్చూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా 18 రోజులుగా గీతాపారాయణం, హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతోంది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు బృందావనం సత్యనారాయణ సారథ్యంలో గోదా దేవి కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ అధికారి దామా నాగేశ్వరరావు, రావువారి వెంకట శివ ప్రసాద్, రెడ్డెత్తు రామారావు పర్యవేక్షించారు.

గుంటూరుకు కొత్త బస్సు సర్వీసు

ఇంకొల్లు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నుంచి నేరుగా గుంటూరుకు నూతన బస్సు సర్వీసును గురువారం ప్రారంభించినట్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహనకృష్ణ తెలిపారు. గతంలో ఇంకొల్లు నుంచి ఉదయం 6.30కు ఒక సర్వీసు ఉండేది. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం మరో సర్వీసు కావాలని గుంటూరు రీజనల్ మేనేజరు రవికాంత్‌కు కోరగా ఈ మేరకు ఇంకొల్లు నుంచి ఉదయం గం.8.15లకు మరో కొత్త సర్వీసును ప్రారంభించారు. తిరిగి సాయంత్రం గం.5.15లకు మరో ట్రిప్పు ఉంటుందని తెలిపారు. ఇంకొల్లు, దగ్గుబాడు, పర్చూరు, పత్తిపాడు మీదుగా ప్రతి రోజూ ఈ సర్వీసు తిరుగుతుందన్నారు. ఈ ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్నేహశీలి నరసింహారావు

అద్దంకిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : స్నేహశీలి టీవీ నరసింహారావు అన్ని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్య అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మండల కార్యదర్శి, జేవీవీ నాయకులు టీవీ నరసింహారావు సంతాప సభ వినుకొండ సుధాకరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో బాబూరావు, హనుమంతరావు, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, పూర్ణచంద్రరావు, కోశాధికారి రామాంజనేయులు, రాజశేఖర్, పోతురాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా నరసింహారావు సంతాప సభ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, శాస్త్రీయ ఆలోచనలు పెరిగేలా చివరివరకూ పోరాటం సాగించిన సామాజిక కార్యకర్త నరసింహారావు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం టౌన్ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.